క్లుప్తంగా

ఆలయ భూములు వేలం పాట వాయిదా

పెద్దముడియం : మండలంలోని చిన్నముడియం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన 16 ఎకరాల భూముల వేలం పాటను వాయిదా వేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు మరో చోట భూముల వేలం పాట ఉండటంతో ఇక్కడికి రాకపోవడంతో వేలం పాటను రద్దు చేసినట్లు తెలిపారు. మరో 10 రోజుల్లో భూముల వేలం పాట వేయుటకు మరో తేదీని నిర్ణయిస్తామని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పెద్దవెంకటరెడ్డి కుటుంబ సభ్యులు

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనాల గ్రామానికి చెందిన పోచంరెడ్డి పెద్ద వెంకటరెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు డీపీఎంఓ ఇ.వి.రమణారెడ్డి, ఉపాధ్యాయుడు పద్మనాభరెడ్డిలు వృద్ధులకు అన్నదాం నిర్వహించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వృద్ధులు, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. 17వ వార్డులోని వాటర్‌ప్లాంట్ సమీపంలో జేసీఎస్ కన్వీనర్లు మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నపిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికి ఫిజియోథెరిఫీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. నిజాం హస్పిటల్ హైదారబాదు నుంచి వచ్చిన డాక్టర్ సంతోష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. సెల్‌ఫోన్ వాడకంపై తగు సూచనలు అందించారు. ఫిజియోథెరిఫీ అవసరం, వాటి అవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ టీచర్ రవికుమార్, ఫిజియోథెరిఫిస్టు డాక్టర్ సతీష్, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

వేముల : మండలంలోని సిద్ధంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సిద్ధంరెడ్డి గంగాధరరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు గ్రామానికి చేరుకుని గంగాధరరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిధులపై విచారణ జరపాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : ఎన్నికలకు సంబంధించిన నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్ మంగళవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విధులను నిర్వహించిన వారికి ఎటువంటి డబ్బులు ఇవ్వకుండా ఇచ్చినట్లు చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలను తీసుకోవాలన్నారు.

కలిసికట్టుగా మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు : మున్సిపాలిటీ అభివృద్ధిని కలిసికట్టుగా సాధించుకోవటానికి అందరం కృషి చేద్దామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన 4 వార్డు కౌన్సిలర్ జ్ఞాన ప్రసూనకు నివాళులు అర్పించారు. అనంతరం ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పట్టణ వాసులకు మంచినీటికి ఇబ్బందులు లేకుండా గండికోట రిజర్వాయర్ నుంచిదిగువన ఉన్న మైలవరం జలాశయంలోనికి నీటిని విడుదల చేయిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకుని సుందరంగా తీర్చి దిద్దుకుంటామన్నారు. దానితోపాటు మున్సిపాలిటీకి సంబంధించిన ఆస్తులు కబ్జాకు గురి అయ్యాయని వాటని చట్ట బద్ధంగా తిరిగి స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని అధికారులు వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో ట్రెజరీ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల వద్ద ట్రాఫిక్‌కు పూర్తి ఇబ్బందిగా ఉందని వాటిని పట్టణ వెలుపల ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ స్థలాలలో నిర్మించి ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి వాడుకుందామన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీకి ఆదాయ వనరులను పెంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నడుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ వాడుకుని వచ్చిన ఆదాయాన్ని తీసుకుని మున్సిపాలిటీకి కరెంటు బిల్లులు చెల్లించాలంటే కుదరదని ప్లాంట్‌లను నిర్వహించిన వారందరికి నోటీసులు ఇచ్చి వారితోనే కరెంటు బిల్లులను కట్టించాలన్నారు. మున్సిపాలిటీలో అత్యవసరంగా చేయవలసిన పనులన్నింటిన్ని త్వరగా పూర్తి చేసి వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చేయాలన్నారు. ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కాలువలను నేషనల్ హైవే అధికారులతో చర్చించి ఆ కాలువ పూడిక పనులను పూర్తి చేయిస్తామన్నారు. మున్సిపాలిటీలో నాలుగు సెంట్ల స్థలం చూపిస్తే ఆ స్థలంలో కౌన్సిలర్ జ్ఞాన ప్రసూన పేరుతో పార్కుతోపాటు, వ్యాయామం కోసం జిం ఏర్పాటు చేయటానికి వంగ నాగేంద్ర ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఒక వీధికి ఆమె పేరు పెట్టటానికి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వరరావు



హాజరైన రేషన్ డీలర్లు

సింహాద్రిపురం : మండలంలో ఉన్న రేషన్ షాపు డీలర్లతో మండల కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ భీమేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 32 రేషన్ షాపులకు గానూ 9,388 రేషన్ కార్డులు ఉన్నాయని, మే నెలలో 8,360 కార్డులకు రేషన్ మంజూరైంది. జూన్ నెలలో 7952 కార్డులకు రేషన్ అందుకున్నారు. 408 కార్డులు రేషన్ తీసుకోలేదని, రేషన్ డీలర్లు తప్పనిసరిగా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ శిరీష, ఆర్ఐ షేక్షా, డీలర్లు, వాహనమిత్రలు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలపై చర్యలు

ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్



ప్రొద్దుటూరు క్రైం : ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఆర్టీఓ పి. మురళీధర్ తెలిపారు. మంగళవారం ఆర్టీఓ మీడియాతో మాట్లాడారు. ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో ఇప్పటి వరకు 285 వాహనాలకు ఎఫ్‌సీ చేసినట్లు తెలిపారు. సుమారు 97 శాతం పైగా విద్యాసంస్థల వాహనాలకు సామర్థ్య పరీక్షలను నిర్వహించామన్నారు. మిగిలిన వారు తప్పని సరిగా వారి వాహనాలకు ఎఫ్‌సీ చేయించుకోవాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే నాలుగు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆర్టీఓ చెప్పారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పని సరిగా నిబంధనలను పాటించాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారిని డ్రైవర్లుగా పెట్టుకోరాదని తెలిపారు. బస్సు వెంట తప్పని సరిగా ఒక అటెండర్ ఉండాలని సూచించారు. డ్రైవరు, క్లీనర్ల పేర్లతో పాటు వారి సెల్ నంబర్లను బస్సులో రాయాలన్నారు. బస్సులపై పాఠశాల, కళాశాలల పేర్లను తప్పక రాయాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణించకుండా ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు హెవీ లైసెన్సులను కలిగి ఉండాలని చెప్పారు. విద్యా సంస్థల బస్సులను ప్రతి రోజూ తనిఖీ చేస్తున్నట్లు ఆర్టీఓ తెలిపారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన



లబ్ధిదారు నుంచి దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు

పోరుమామిళ్ల : పేదవానికి బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఉపయోగపడుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీజనల్ మేనేజర్ మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ రంగసముద్రం శాఖలో విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, ఖాతాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఎం మురళీనాయక్ మాట్లాడుతూ ఉపాధి లేని వృత్తి పనివాళ్లలకు విశ్వకర్మ యోజన ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు ప్రధానమంత్రి ఈ పథకం తీసుకవచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో తిరిగి చెల్లిస్తే వారికి మరిన్ని రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట చీఫ్ మేనేజర్ జాఫర్ మొహిద్దీన్, రంగసముద్రం ఎస్‌బీఐ మేనేజర్ నరేంద్ర, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకుడు సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు క్రైం : మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలు, శానిటరీ సిబ్బందికి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వీరికి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ సిబ్బందికి సంబంధించిన పీఎఫ్ సొమ్మును అజిల్ కంపెనీ, చైతన్య జ్యోతి కంపెనీలు సరిగా చెల్లించలేదని చెప్పారు. క్యాజువల్ లీవ్‌లు కూడా అమలు చేయకుండా సూపర్‌వైజర్లు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ యూనియన్ ఉద్యోగ కార్మికులు లత, రాజమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు ఎంఈఓ శోభారాణికి వినతి పత్రం అందించారు. బుధవారం ఆమె కార్యాలయంలో కలిసి అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలోనే పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఎంఈఓకు వివరించారు. 25 శాతం పేద విద్యార్థులకు విద్యాసంస్థలు ఉచిత విద్యను అందించడం లేదని, విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం లేదని, ఆటస్థలాలు లేవని, సరైన పాఠశాల క్యాంపస్ లేవన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేదిక సభ్యులు మహబూబ్ బాష, రసూల్‌బి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



రాజుపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జాతీయ బృందం

బద్వేలు అర్బన్ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు డాక్టర్ ప్రేమాన్షుపాండ్యా, డాక్టర్ సిద్ధార్థశుక్ల పేర్కొన్నారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని రాజుపాలెం పంచాయతీలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను మంగళవారం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు సంబంధించిన నేషనల్ క్వాలిటీ కంట్రోల్ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. బృందంలోని వైద్యులు మాతాశిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాల పంపిణీ, హెల్త్‌క్లినిక్ నిర్వహణ, మందుల పంపిణీ వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యం, శిశువు ఆరోగ్యంపై దృష్టి సారించి మాతాశిశు మరణాలు లేకుండా చూసేందుకు కృషి చేయాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ సభ్యులు సరళాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, సీహెచ్‌ఓ ప్రభావతి, శుభలేఖ, రాధ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, ఏఎన్‌ఎంలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

జమ్మలమడుగు రూరల్ : వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధైర్యం కోరారు. మంగళవారం జమ్మలమడుగులోని పెన్నానర్ల భవనంలో అధ్యక్షుడు ధైర్యం, మండల అధ్యక్షుడు గురుమోహన్ ఆధ్వర్యంలో వీఆర్‌ఏల నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ధైర్యం మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ఫెడ్రిక్ రాజు, ట్రెజరర్ బి.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి శాంతయ్య, కమిటీ సభ్యులు చౌడయ్య, దానియల్, రామసుబ్బయ్య, అరుణ్ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన వైవీయూ వీసీ

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా ,యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డిని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రాయచోటిలో యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ స్థితిగతులను వివరించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం విశ్వవిద్యాలయ ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారని వీసీ తెలిపారు. అనంతరం కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవీరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, నాయకులు పుత్తా నరసింహారెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పోరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

రైతులకు బాసటగా కిసాన్ సమ్మాన్ నిధి

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఎంతో బాసటగా నిలుస్తుందని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల సందర్భంగా కేవీకేలో రైతులను సమావేశపరిచి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ఈ నిధులు అందాల్సిన అవసరం ఉందన్నారు. కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులు ఏడాదికి పొందే రూ.6వేలు లబ్ధి వారికి ఎంతో సాయంగా ఉండి, పెట్టుబడులను తగ్గిస్తుందని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం వల్ల భూమి సారాన్ని కాపాడవచ్చన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీలు, నిధుల తోడ్పాటుతో పాటు విలువ పెంపొందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. దీని వల్ల ఆర్థికంగా మరింత ముందుకు పోవచ్చన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమస్యలపై ప్రజలనుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకంపై రైతులకు లైవ్ షో



టీవీ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు

లింగాల : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ పథకంపై ప్రసంగాన్ని రైతులకు లైవ్ షోలో చూపించారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని వారనాసి నుంచి పీఎం కిసాన్ పథకానికి రూ.20 కోట్ల నిధులు విడుదల చేసిన విషయాలను రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్ లిమిటెడ్ కంపెనీ అధికారి రాకేష్ రైతులను సమావేశపరచి ఈ లైవ్ షోను చూపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల ప్రసంగాలను వినిపించారు. కార్యక్రమంలో రైతులు, సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు, పిల్లలకు వైద్య పరీక్షలు



పాఠశాలలో అధికారుల సమావేశం నిర్వహించిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్

లింగాల : మండలంలోని పార్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలింతలకు, గర్భిణులకు, చిన్నపిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలను డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ పరిశీలించారు. రక్తహీనత ఉన్నవారికి తగిన వైద్య పరీక్షలు అందించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 30 మంది కిశోర బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని గుర్తించేందుకు రక్తపరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిబిడ్డల సంరక్షణ కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ఎస్ఓ రమేష్‌రెడ్డి, డీపీహెచ్ఎన్ఓ అరుణ, డీపీఓ కుమార్ నారాయణ, సీహెచ్ఓ శివరామ్, హెల్త్ సూపర్‌వైజర్లు కుసుమకుమారి, హసియా బేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రహదారులపై వర్షపునీటిని తొలగించాలి



గురుకుల్ విద్యాపీఠ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులపై ఉన్న నీటిని తొలగించాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా వై జంక్షన్, అప్సర రోడ్, పుష్పగిరి స్కూల్, గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అప్సర సమీపంలోని మోర్ మార్కెట్ వద్ద పెద్ద ఎత్తున నీరు నిలవడంపై కమిషనర్ డ్రైన్ లెవెల్స్ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అప్సర జంక్షన్ వద్ద వినాయకుని గుడి పక్కన డ్రైన్ వెడల్పు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంజన్న సర్కిల్ నుంచి పుష్పగిరి స్కూల్ మీదుగా నిర్మించిన వరదనీటి కాలువలో నీటి ప్రవాహం పెరిగేలా పైపు కల్వర్టును తొలగించాలన్నారు. ఆ స్థానంలో కల్వర్టు నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఏడాది వరద కాలువల్లో పూడిక తీయించాలన్నారు. గురుకుల్ విద్యాపీఠ్ వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ ధనలక్ష్మి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



దుర్గమ్మ సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. విశేషంగా నూతన పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలు, గజమాలలు, వడమాలతో అలంకరించారు. భక్తులు ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిగీతాలకు మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.